కథా నిలయం
20535
శ్రీకాకుళం

# మిస్. మరీచిక

**ఈ** కథలో మిస్టర్ మధుసూదనం మాత్రం కనిపిస్తాడు. మిస్ మరీచిక కనిపించదు. ఒక వేళ కనిపించినా ఆమె మరీచిక కాదనీ, అక్కడ మరీచిక లేదనీ భావింపగలరని మనవి. మరీచికంటే ఎండమావి కదుటండీ మరి!

* * *

బస్ స్టాండులో దిగాను. ఉదయం పది గంటల వేళ సూర్యరశ్మి క్షణక్షణానికీ లోకంపైకి తీవ్రించుకుంటోంది. నీరెండలో యిరవై మైళ్ళ బస్సు ప్రయాణం. ఒళ్ళు నజ్జు గుజ్జయి పోయినట్టుంది. చల్ల చల్లగా ఓ శీతలపానీయంతో అన్నవాహిక చెమ్మగిల్లితే బాగుండును. కళ్ళు మూసుకుని ఏ వైపున నడిచినా ఓ 'కాఫ్యాలయం' ఎదురొతుంది. మొదట ఈ బస్ స్టాండు బూడిద దుమ్మునుంచీ బయటపడితే చాలు.

తలవంచుకుని చరచరా నడుస్తున్నాను.

హైరోడ్డు నుంచీ ఏటవాలుగా క్రిందికి దిగుతున్న దారిలో అడుగులు సాచివేస్తూ హుటాహుటిగా వస్తున్న యువకుడొకడు తారసిల్లాడు.

తల వంచుకున్నందున నా కతడి నల్లటి పాదరక్షలు మాత్రం కనిపించాయి. లేదంటే మడత చెరగని నీలిరంగు ఫాంటులో కొంత భాగం కనిపించి వుంటుంది. బహుశా ఆ తీవ్ర గమనాన్ని బట్టి నేనతణ్ణి యువకుడనుకున్నానేమో! ఆతడు నన్ను దాటుకున్నాడు. కొంత దూరం వెళ్ళిపోయాడు.

పదడుగులు ముందుకు సాగిన తర్వాత అత డక్కడ ఆగి నన్ను గనుక పిలువక పోయివుంటే, యిప్పు డిక్కడ కథంటూ ఒకటి వుప్పతిల్లడానికి ఆస్కారమే వుండేదిగాదు.

అతడు పిలిచాడు. నేను వెనుదిరిగి అతడి వైపు చూచాను.

"మరేమీ అనుకోకండి సార్! మీ పేరు?" అంటూ చేరువకు వచ్చాడు.

నేను విస్తుపోయాను. అతడు నన్ను తనకు తెలిసిన మరొక మనిషి క్రింద జమ కడుతున్నాడేమో ననుకున్నాను. అంతలో ఆ ముఖం నా కేనాడో సుపరిచితమైందన్న జ్ఞాపకం మనసులోని అట్టడుగుపొరల్ని చీల్చుకుని పైకి రావడానికి ప్రయత్నిస్తున్నట్టు నా మట్టుకు నాకే ఒక భ్రమ కలిగింది. అది మేఘాల్లో మెరపులాంటి జ్ఞాపకం. వెలుగు వెంబడే నీడ వున్నట్టు ఆ మెరపు వెంటనే మరపు;

ఈ మెరపు మరపుల ప్రసక్తి అలా వుంచి నేను మొదట అతడి ప్రశ్నకు జవాబు చెప్పుకోవలసి వచ్చింది. చెప్పూకున్నాను.

"ఒరేయ్, ఒరేయ్! ఐనా యింతటి దురాగతమా! ఇంత సేపటి నుంచి పరకాయించి చూస్తున్నా గుర్తు తెలియ నంతగా మారిపోయానా! నువ్వే కాదు. నేను రెండు మాసాల నుంచీ చూస్తున్నాను. కనిపించిన ప్రతి మిత్రుణ్ణి నాకు నేనై నిద్రలో నుంచీ తట్టి మేలుకొల్పినట్టు 'నేను పలానావాణ్ణి, నువ్వు పలానా వాడివి గదా' అని పలకరించవలసి వస్తోంది."

నా కప్పటికి తెలిసింది అతడు మధుసూదన మని! అతడి చేయి పట్టుకుని "హోటల్లో కూచుని మాట్లాడు కుందాం రా" అన్నాను.

ఉన్నాడో వూడాడో తెలియకుండా నిండుగా పదేండ్లు కాలగర్భంలో కలిసిపోయిన తర్వాత ఓ రోజు వుదయం వున్న ట్టుండి బస్ స్టాండులో ఎదురైన బాల్య మిత్రుడితో సంభాష ణకు వుపక్రమించవలసిన తీరు ఇది కాదేమో!

నాలుగైదు అధ్యాయాలు మాత్రం చదివి 'బాగుంది, పూర్తిగా చదవాలి' అనుకున్న పుస్తకం ఒడలినిండా బూజు పులుముకుని పదేళ్ళ తర్వాత అటకమైన్నుంచి క్రింద పడితే, మొట్టమొదట ఆ బూజును దులిపి వేయవలసి వుంటుంది. బూజును దులుపుతుండగా పుస్తకంలోని కథ మదిలో మెదులు తుంది. ఐతే ఇక్కడ బూజు పట్టింది మధుసూదనానికి కాదు. వాడికేం! వాడు నిక్షేపంగా వున్నాడు. పళపళ లాడుతున్న

దుస్తులతో, ఎలా పడివుండమంటే అలా పడివుండానికి అలవాటుపడిన క్రాపింగుతో, సౌకుమార్యం ఉట్టిపడుతున్న ముఖభంగిమతో, తాంబూల రాగరంజితాలై లిప్‌స్టిక్ పూసుకున్నట్టున్న పెదవులతో వాడు ప్రత్యక్షమయ్యాడు. ఒక వైపున వాడు ప్రత్యక్షమైన సంభ్రమంతో వుక్కిరి బిక్కిరై పోతూ, మరొక వైపున పదేళ్ళ పొడుగునా జీవితంలో జరిగిన సంఘటనల క్రింద, సంఘర్షణల అడుగున మాటుపడిపోయిన బాల్య స్మృతుల్ని పైకి తోడి, వాటిపైన పేరుకున్న బూజును గూడా నేను దులుపుకోవలసి వచ్చింది.

హోటల్లో జనం నడయాడని చోట ఏకాంతంగా కూచుని నేనేం ఉద్యోగం చేస్తున్నదీ, ఎంత సంపాదిస్తున్నదీ, ఎప్పుడు పెళ్ళయిందీ, సంతాన సౌభాగ్య మేపాటిదీ మున్నగు వివరాలు అడిగి తెలుసుకున్న తర్వాత మధుసూదనం తన కథ చెప్పుక పోసాగాడు. వాడికింకా పెళ్ళి కాలేదు. అది వాడికి సంతోష కారణమే! పెళ్ళయి వుంటే వీడు జీవితాన్ని నాలుగు చెరగుల నుంచీ చూచివుండడానికి వీలుపడేది గాదట. నిలకడగా ఒక చోట పడివుండడం తన మనస్తత్వానికి సరిపడని సంగతి కావడంచేత దాదాపు ఒక డజను ఉద్యోగాలను చవిచూచాడు. కొన్ని వుద్యోగాలు వీడే మానేశాడు. మరికొన్నింటిలో పైవాళ్ళే వీడిచేత మానిపించేశారు. ప్రస్తుతం ఓ గడియారాల కంపెనీకి ఏజంటు. "ద్రవ్యమారకం యిక్కట్లవల్ల విదేశీ దిగుమతులు నిలిచిపోవడంతో తాత్కాలికంగా వ్యాపారం స్తంభించిపోయింది. ఎలాగూ తీరిక దొరికిందిగదా అని పాతనేస్తాలను పరా

మర్శించి పోవచ్చునని యిక్కడ మకాం పెట్టాను. రెండు నెలలయింది,'' అన్నాడు.

"మంచి పని చేశావు'' అన్నాను.

"వచ్చినప్పటి నుంచీ కళ్లకు కలికం వేసుకుని గాలి స్తున్నాను. మన మిత్రుల్లో కొంత మంది మాత్రం కని పించారు. వాకబుచేయగా నువ్వు మీ వూళ్ళో వున్నట్లు తెలిసింది. వద్దామనుకుంటున్నాను. ఇంతలో నువ్వే కలిశావు. ఎలాగైతేనేం! నువ్వు కదలడానికి వీల్లేదు. కనీసం రెండు రోజులు నాకు అతిథిగా ఉండిపోవాలి''—అన్నాడు మధు సూదనం.

"అభ్యంతరం ఏమీ లేదు గానీ ఒక చిన్న సవరణ. నేను చాలా తొందర పని మీద వచ్చాను. పని చూచుకుని సాయంత్రమే వెళ్ళిపోవాలి. రాబోయే శుక్రవారం మా ఊళ్లో సేవాసమితి వార్షికోత్సవం ఏర్పాటు చేస్తున్నాము. నువ్వు బుధవారమే వచ్చేయాలి. ఇద్దరమూ నాలుగు రోజుల పాటు కలిసి వుండొచ్చు. హమేషా పట్టణాలపైన తిరిగేవాడివి. నీకు పల్లెటూళ్ళ జీవితాన్ని రుచి చూపిస్తాను'' అన్నాను.

"ఉత్సవంలో నాటకాలుంటాయిగదా! ఉంటే నేను సిద్ధం.''

"నాటకాలకేం కొదవ? పప్పులేని పెండిండ్లు ఉంటాయి గనుకనా! కానీ నువ్విప్పుడో సహాయం చేయాలి.''

"పరోపకారార్థ మిదం శరీరం గదా! అందులోనూ మిత్రుడువి. ఏం సహాయం కావాలో చెప్పు" అన్నాడు మధుసూదనం.

అప్పుడు నేను మధుసూదనంతో శోభాదేవిని గురించి ప్రస్తావించాను. వార్షికోత్సవానికి ఆమెను తీసుకెళ్ళవలసిన అవసరాన్ని వివరించాను. చిట్టచివర "మృగాక్షుల యందు ప్రగల్భభావముండాలికదా మధూ! నా సంగతి నీకు తెలిసిందే! తీరా ఆమె ఎదుటకు వెళ్ళిన తర్వాత ఒకటి మాట్లాడ దలచుకుని మరొకటి మాట్లాడుతానేమో అని భయంగా వుంది. పైగా ఆమెకు చిరాకెక్కువనీ, కోపం ముక్కుపైన్నే ఉంటుందనీ ప్రతీతి. మన మిద్దరంగా వెళ్ళి ఆమెను ఆహ్వానించాలి. నాకు బదులుగా నా మాటలన్నీ నువ్వే మాట్లాడేయాలి" అన్నాను.

"ఓస్, యింతేనా! ఇంకా యిదేదో గొప్ప సహాయం కాబోలనుకున్నాను. నీ కెందుకూ, ఆ శోభాదేవిగారిని నీ ఆహ్వానాని కొప్పించే భారం నాది. కానీ ఇప్పుడు మనం మొదట భోజనం కానివ్వాలి. నా కాకలిగా వుంది. తెల్లవారెప్పుడో ఆదరా బాదరాగా లేచి తినీ తినకా రెండు మైళ్ళు నడిచి రోడ్డులో బస్సెక్కి వుంటావు గనుక నీకూ ఆకలిగానే వుంటుంది...ఇదిగో అబ్బాయ్, టూ మిల్స్" అంటూ సర్వరును కేకవేశాడు మధుసూదనం.

భోజనమైన తర్వాత మధుసూదనం నన్ను వాడి గదికి తీసుకెళ్ళాడు. ఉద్యోగుల్లోనూ, కాలేజి విద్యార్థుల్లోనూ,

బ్రహ్మచారులై ఒంటరిగా బ్రతుకు వెళ్ళదీస్తున్న వారి సౌఖర్యార్థం గదులు గదులుగా విభజించి కట్టిన ఓ పెద్ద కట్టడంలోని రెండో అంతస్థులో, ఓ మారుమూల గదిలో వాడి మకాము. నా కోసం తన పరుపును పరచి మధుసూదనం వాలుకుర్చీలో కూచున్నాడు. కూర్చున్న మరుక్షణం నుంచీ గది తలుపు తాళం తీస్తుండగా ఆగిపోయిన తన సీరియల్ కథను మళ్ళీ ప్రారంభించాడు.

కానీ గదిలో సేదదీరిన తర్వాత వాడి మాటలేవీ నాకు వినిపించడం లేదు. ఒక వేళ వినిపించినా అవి నా కర్థం గానడం లేదు. గోడపైన రకరకాల కాలెండర్లకు మధ్య వ్రేలాడుతున్న ఫోటోపైకి వెళ్ళిన నా చూపులు, పాశాలుగా మారి మనసును కూడా దానిపైకే లాగేశాయి. ఆ ఫోటోలో ఉన్న యువతిని ఓ సినిమా తారగా భావించడానికి అవకాశ మున్న మాట నిజమే. కానీ నాకు తెలిసినంత వరకూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాల్లో అలాటి తారను చూచినట్టు జ్ఞాపకం లేదు. ఐతే ఈమె ఎవరై ఉంటుంది? ఎవరో గానీ యిదివర కెప్పుడో ఈమెను చూచినట్టే వుంది. చేయి తిరిగిన చిత్రకారుడి చిత్రంలా తీర్చి దిద్దినట్టున్న మనోహర శిల్పంలా అంత పొంకంగా కుదిరిన అంగసౌష్టవం మన కెక్కడోగానీ కన్పించదు. ఎన్నడోగానీ కనిపించదు.

"ఆ పరిస్థితిలో నువ్వయితే ఏంచేసి వుండేవాడివి?"

నేను వులికిపడ్డాను. ఇందాకా మధుసూదనం చెప్పిం దేమిటో నా కవగతం కాలేదు.

"నేనా! ఆ పరిస్థితిలోనా? ఏ పరిస్థితిలో?" అన్నాను పరధ్యానం నుంచి తేరుకుంటూ.

"ఐతే నీ మనసు ఇక్కడ లేదన్న మాట!"

"లేదురా బాబూ లేదు! గదిలో ఇలాటి సౌందర్య రాశిని ప్రతిష్టించుకోమని నీ కెవరు చెప్పారు? ఈ ఫోటోను చూస్తూ, చూస్తూ రామాయణంలో పిడకలవేటలాంటి నీ గొడవ కూడా వినాలంటే ఎలా సాధ్యమౌతుంది?"

మధుసూదనం దిగ్గున లేచాడు. "నిజంగానా రాజూ! అంత బాగుందా ఈ ఫోటో?" అంటూ నా కేసి ఆశ్చర్యంగా చూచాడు.

"బాగుంది మధూ! చాలా బాగుంది. కానీ నీ ధోరణి మాత్రం నాకు నచ్చడం లేదు. నువ్వు నీ జీవితంలోని రసవద్ఘట్టాలను గోప్యంగా వుంచుకుని, చెత్త అనుభవాలను ఏకరువు పెడుతున్నావు" అన్నాను.

"నిజమేరా రాజూ! అదంతా ఓ విషాద గాథ" అన్నాడు మధుసూదనం వేడిగా నిట్టూరుస్తూ.

"ఐతే మాత్రం! ఒక విషాదగాథను కథా సాహిత్యానికి దక్కనీయకుండా ఎదలో దాచుకుని నువ్వు బావుకోబోయే దేముంది చెప్పు" అన్నాను.

"ఐతే చెప్పమంటావా" అన్నాడు మధుసూదనం.

"చెప్పు చెప్పు. ఈ విషాదగాథను భరించలేనేమో నన్న సందేహం నీ కనవసరం. నేను 'దేవదాసు' సినిమాను అయిదు సార్లు చూచాను."

"ఒక షరతుపైన చెబుతున్నాను రాజూ! వివరంగా చెప్పమని నన్ను నిర్బంధించ కూడదు. ఊరి పేరు అడగొద్దు. అడిగినా నేను చెప్పను. ఆవిడ పేరు మరీచిక. బెంగాలీ వాళ్ళ నుకునేవు. కాదు. అచ్ఛంగా మన ఆంధ్రా అమ్మాయి. జీవిత పథంలో ఆకస్మికంగా నా కెదురైంది. చూపులు, మాటలు, మనసులు కలవడానికే 'ప్రేమ' అన్న పేరైతే మే మిద్దరమూ ఆ ప్రేమ తాలూకు ప్రభావానికి లోనయ్యామన్న మాటే! కానీ విధి ప్రతికూలించింది. మేము విడిపోయాము. నే నిక్కడ, ఆమె ఎక్కడో నాకు తెలియదు. గడచిన గాథ జ్ఞప్తికి రాగా, మనసంతా వేదనతో దహించుకపోగా, బ్రతుకే పోగా, బ్రతుకే బాధగా, ఒకే నిరాశగా ఇలా రోజులు గడుపు తున్నాను."

నేను మీటింది మధుసూదనం హృదయ వీణలోని విషాద తంత్రినేమో, వాడి ముఖ బింబం విచారంతో చిన్నదై పోయింది. కంఠం గద్గదికమై పోయింది. కళ్లు కన్నీటి కొలనులై పోయాయి.

"పోనీలే మధూ! అదేం చిత్రమోగానీ, ప్రేమికులకు సంబంధించిన ఏ విషాదగాథయినా యిలాగే వుంటుంది. అందు కిప్పుడు మనం ప్రత్యేకంగా చింతించి లాభమేముంది చెప్పు. ఈ సారి బుద్ధిగా ప్రేమించక మునుపే ఓ అమ్మాయిని పెళ్ళాడి, ఆ తర్వాత తీరిగ్గా ప్రేమించడానికి ప్రయత్నించడానికి ప్రయ త్నించు. ఈ పద్ధతిలో ఆశాభంగానికి తావుండదు." అని

సలహాతో ఓదార్పును రంగరించి మావాడికి హితబోధ చేశాను.

*　　　　*　　　　*

మధుసూదనం కాస్తా దూరదృష్టి వున్న మనిషి. నేను పడుకుని నిద్రపోతుండగానే క్రిందికి దిగివెళ్ళి చేరువలోనే వున్న మండీలో నుంచీ అతడు ఫోను మీదుగా శోభాదేవిగారితో మాట్లాడివచ్చాడు. ఆమె సాయంత్రం మమ్మల్ని కలుసుకోవడానికి అంగీకరించిందన్న శుభవర్తమానాన్ని నిద్రలేవగానే నాకు నివేదించాడు. టంచనుగా అయిదు గొట్టేసరికి మేము శోభాదేవిగారి సముఖాన హాజరయ్యాము. నిజానికి అసంఖ్యాకమైన కార్యకలాపాల మధ్య శోభాదేవిగారి పని బిజీగానే కాదు, గజిబిజిగా గూడా వుంది. ఆమెను సమావేశాలకు ఆహ్వానించడంకోసం అప్పుడా గదిలో పోటి పడుతున్న యిద్దరిలో ఒకరు స్థానికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు. మరొకరు హిందీ ప్రేమీమండలి అధ్యక్షులు. ఒకరిపైన మరొకరు కుట్రపన్నినట్టుగా, ఆ యిద్దరు పెద్ద మనుషులూ పన్నెండో తేదీ సాయంకాలం ఆరు గంటలకు సరిగ్గా కార్యక్రమాన్ని నిశ్చయించుకుని మీరు రాక తప్పదంటే తప్పదంటూ శోభాదేవికి చెరొక వైపున భీష్మించుకుని కూర్చున్నాను.

ఇలాంటి చిక్కు అప్పుడప్పుడూ పెద్ద ఆఫీసర్లనీ, పురప్రముఖుల్నీ ఎదురోకవడం కద్దు. అప్పట్లో వాళ్లు ఆలోచనకు దిగి అట్టే శ్రమ పెట్టుకోకుండా యిందుకొక పరిష్కార మార్గం

సూచించడం కూడా కద్దు. ఒకే ముహూర్తంలో రెండు శుభ కార్యాలు జరిగి, రెండింటికీ తప్పకుండా హాజరు కావలిసి వచ్చినప్పుడు గృహమేధి ఒక చోటకు, గృహిణి ఒక చోటుకు వెళ్ళి వెలితిని కప్పి పుచ్చడం అనూచానంగా వస్తున్న సాంప్రదాయం. దురదృష్టవశాత్తు శోభాదేవిగారి కావెసులు బాటు కూడా లేకపోయింది. ఆమె భర్త ఆర్మీలో ఎక్కడో ఉన్నతోద్యోగంలో వున్నాడు.

నా మట్టుకు నాకు ఈ సందిగ్ధావస్థలో ఆ ప్రధానోపాధ్యాయులకూ, ఈ ప్రేమీ మండలి అధ్యక్షులకూ మధ్య ప్రాణాలకు ముప్పు తలపెట్టరాదన్న ఖచ్చితమైన షరతు మీద ఓ చిన్న సైజు ద్వంద్వయుద్ధాన్ని ఏర్పరచడం వినా మార్గాంతరం లేదనిపించింది.

కానీ యింతలో పీడి కెవరో పిలిచి పెత్తన మిచ్చినట్టు మధుసూదనం స్వయంగా రాజీ ప్రయత్నాలకు పూనుకున్నాడు. వాడు హెడ్మాస్టరు వైపు చూస్తూ అన్నాడు గదా–"కాదండీ మేస్టరుగారూ! ఎలాగూ మీవి వార్షికోత్సవాలని చెబుతున్నారు. ఇక ప్రేమీ మండలిలో జరుగబోతున్నదా స్నాతకోత్సవం. అది ఎంత నిదానంగా జరిగినా ఎనిమిది గంటల లోగా పూర్తవుతుంది. అప్పటికి మీ నాటకంలో ఐదారు సీనులు జరిగివుంటాయి. మిగిలిన కథను రంగంపైన చూడాలని సభాసదులు కుతూహలంతో వుంటారు. నన్నడిగితే కుర్రాళ్లు దండిగా గుమిగూడే సభల్లో ఉపన్యాస కార్యక్రమాలకు అదే సరైన అదను. తరుతవాత మీ విషయం.

మా వాడి ప్రతిపాదనను ప్రేమీమండలి అధ్యక్షుడు బొంగురు గొంతుకతో బలపరిచాడు. "మా బాగా చెప్పేశా రండీ! నాటకానికి ముందే మీటింగని చెబుతే 'ఆఁ వెళ్లాం లేవోయ్, ఇప్పుడు **మించిపోయిం**దేముంది' అని హాయిగా భోజనం చేసుకుని తీరిగ్గా వేంచేస్తారు. అలా కాదని నాటకానంతరమే ఏర్పాటు చేశామనుకోండి, ఆ మీటింగెలా తయారవుతుందో మనకు తెలుసు. ఏ విధంగా చూచినా ఈ సూచన అంగీకారయోగ్యంగా కనబడుతోంది."

నే నాశ్చర్యంగా మధుసూదనం వైపు చూచాను. ఆ క్షణాన వాడు నాకు మిల్లు గుడ్డలకు కరువొచ్చిపడిన రోజుల్లో పెద్ద ఎత్తున బట్టల దుకాణాన్ని నడిపిన వర్తక ప్రముఖుడిలా గోచరించాడు. అప్పుడు మేలు రకం షర్టింగు గుడ్డ కావలసి వస్తే దానితో బాటుగా ఎందుకు పనికిరాని నామర్దా గుడ్డను గూడా విధిగా కొనుక్కోవలసి వచ్చేది!

ఎలాగైతేనేం. మావాడి వల్ల ధర్మసందేహం నివారింపబడి హెడ్మాస్టరుగారికి హిం. ప్రే. మం, అధ్యక్షులు గారికీ రాజీ కుదిరింది. వాళ్ళు తమ కార్యక్రమాలను కాస్తా ముందుకూ వెనక్కూ జరుపుకోడానికి ఒప్పుకొని, ఆ ఒప్పుదల మీద శోభాదేవిగారి ఆమోదముద్ర వేయించుకుని సంతృప్తిగా వెళ్ళిపోయారు.

వాళ్ళలా నిష్క్రమించగానే "యిక మీ గొడవేమిటో కానివ్వండి" అన్నట్టుగా శోభాదేవి మా వాడివైపు చూచింది.

"నన్ను గురించి చెప్పుకోవలసిందంతా ఫోను మీాదనే చెప్పుకున్నాను గదండీ!" అని మధుసూదనం నన్నామెకు పరిచయం చేయడానికి ఉపక్రమించాడు. "ఇతని పేరు రాజశేఖరం. స్వగ్రామం తిప్పసముద్రం. అక్కడ యువకులు కొందరు కలిసి సేవాసమితి అన్న పేరుతో ఓ సంస్థను స్థాపించారు. పేరులోనే ఆశయం అంతర్గర్భితమై వుంది గనుక యిక మీాకు వివరాలు ఏకరువు పెట్టడం అనవసరం. ఆ సమితికి పై శుక్రవారం వార్షికోత్సవం తలపెట్టుకున్న విషయం మాత్రం ప్రస్తుతాంశం. సదరు వార్షికోత్సవానికి విచ్చేసి కార్యకలాపాలను మీా చేతిమీాదుగా జయప్రదం చేయాలని మా వినయపూర్వకమైన మనవి!"

స్లేటు పలకలాగా, పేపరు కాగితంలాగా ఈ వినయపూర్వకమైన మనవేమిటో నాకర్థం గాలేదు. స్లేటులోనే పలక, పేపరులోనే కాగితం వున్నట్లుగా మనవి అన్న తర్వాత అందులో ఆటోమాటిక్‌గా వినయం అంతర్లీనమై వుండనే వుంటుంది గదా! ఏమిటో మరి, ఈ వినయపూర్వకమైన మనవి సంగతి ఎలా వున్నా నాకొకందుకు మాత్రం సంతృప్తి కలిగింది. మా వాడికి లేని భాషాజ్ఞానం కన్నా వున్న లౌకిక జ్ఞానంతో వీడు వూళ్ళు తిరిగి ఎవడికి బడితే వాడికి గడియారాలు అంటగట్టడమే గాదు, శోభాదేవిగారి లాంటి వాళ్ళని గూడా ఆహ్వానాలకు ఒప్పించగలడు!

మా వాడి మాటల ధోరణి శోభాదేవిగారి పైన బాగానే పని చేసినట్టుంది. ఆమె ప్రసన్న వదనంతో "కానీ

మీ రదేదో తిప్పసముద్ర మంటున్నారు. ఇంత వరకూ ఆ పేరు విన్నట్టు జ్ఞాపకం లేదు ఎంత దూరముంటుంది? ఏ వైపుగా వెళ్ళాలి?" అని ప్రశ్నించింది.

"ఎంతో దూర మెక్కడిదండీ! కదిరి బస్సులో కూచుంటే ఓ గంట గంటన్నర ప్రయాణం. ఇక తిప్పసముద్రం సంగ తంటారా, 'అది మీ రన్నట్లు పల్లెటూరే! కాదంటే పోనీ పేటకొంపనుకోండి! కానీ, ఆ మాటకొస్తే భారత దేశమే పల్లెటూళ్ళ దేశం గదండీ! పైగా ఒక రహస్యమేమిటంటే, ఏ వుద్యమాన్ని స్టార్ట్ చేయడానికైనా పల్లెటూళ్ళే మేలు గదండీ! ఉదాహరణకు, పట్టణంలో ఒక గొప్ప నాయకుడే ఉపన్యసిస్తున్నా డనుకోండి. వచ్చేవాళ్ళు వస్తుంటే, వెళ్ళే వాళ్ళు వెళ్తుంటే సభా స్థలమంతా ఓ రైల్వేప్లాటుఫారంలా కనిపిస్తుంది. పల్లెటూళ్ళో అలా జరగదు. ఆ రెస్పాన్సే వేరు. ఊళ్ళోకి వచ్చిన వాడు బుడబుక్కలవాడే గానివ్వండి, వాడి వెంట ఓ వందమంది హాజరు పలుకుతారు. స్వయంగా చూడ బోతున్నారు గదా, మీకే తెలుస్తుంది....."

"కానీ నా అభిప్రాయ మేమిటంటే మధుసూదనం గారూ" సులోచనాలు సరిచేసుకుంటూ అంది శోభాదేవి "ఇది మహిళా మండలి గాకపోయె! సేవాసమితి అని చెబు తూనే వుంటిరాయె! దీనికి నా కంటే అర్హత గలిగిన వారు మీకు దొరక్క పోయారా?"

ఈ యక్షప్రశ్న తాకిడికి మా వాడు తబ్బిబ్బు పడక తప్ప దేమో ననుకున్నాను. కానీ అలాంటిదేమీ జరుగ లేదు.

మధుసూదనం తన కళ్ళని చేటల్లా ఆకర్ణాంత విశాలాలు చేసుకుని "చూచావా రాజూ! సరిగ్గా నాకు కలిగిన సందేహమే శోభాదేవి గారికి గూడా కలిగింది!" అంటూ శోభాదేవి గారికి అభిముఖుడై "నేనూ మా రాజశేఖరాన్ని అదే మాట అడిగానండీ! అందుకు వీడేమన్నాడూ- 'ఒరేయ్ మధూ! అసలు సేవాశీల మన్నది ఆడవాళ్ళ సొత్తు. వాళ్ళ సహాయ సహకారాలు, ప్రోత్సాహ ప్రోద్బలాలు, లేందే సేవా సమితులేం రాణిస్తాయి? వాస్తవం యిలా వుండగా యిక పల్లెటూళ్ళల్లో ఆడవాళ్ళ వ్యవహారమంతా అదో రకంగా వుంది. ఫార్ ఎగ్జాంపిల్ నా భార్యే వుందనుకో, ఆవిడ యింట్లో తోసిన చెత్తనంతా ప్రక్కయింటి గుమ్మంలో పారబోస్తుంది. ప్రక్కింటావిడ మాత్రం తక్కువ తిన్నదేమిటి? ఆమె ఆ చెత్తకు మరింత చెత్త గలిపి దాన్ని పెరటి గోడపైన్నుంచి మా దొడ్డిలోకి గిరవాటెడుతుంది. అంచేత పల్లెటూరి పడతులకు వాగ్వికోత్సవం ప్రబోధకరంగా వుండాలన్న వుద్దేశంతో శోభాదేవి గారిని ఆహ్వానింప దలచుకున్నాం' అన్నాడు. ఈ సంజాయిషీ విన్న తర్వాత నాకూ మారు మాటాడ్డానికి మనస్కరించింది గాదు."

కుర్చీలో చేరగిలబడి ఒకటి రెండు నిమిషాలపాటు అర్ధ నిమీలిత నేత్రాలతో పైకప్పు వంక చూస్తూ వుండిపోయి ఆ తరువాత హఠాత్తుగా ప్రశ్నించింది శోభాదేవి.

"ఐతే బస్సులోనే రావలసి వుంటుందన్న మాట?"

"మరి తిప్ప సముద్రానికి రైలు మార్గం లేదుగదండీ!" అన్నాడు మధుసూదనం.

"బస్సు వూళ్ళో నే ఆగుతుందనుకుంటాను."

"అబ్బే. లేదండీ! వచ్చిన చిక్కే-అది ఊరికి రోడ్డుకూ రెండు మైళ్లుంటుంది."

"రెండు మైళ్ళేక్కడిది మధూ! ఒకటిన్నర మైలుకంటే ఎక్కువ ఉండదు" అంటూ యిక్కడ నేను స్వయంగా కలుగ జేసుకున్నాను.

"మీరు చూడకోండి" చూకు వీకుణాలతో నన్ను వారించింది శోభాదేవి. "మీ పల్లెటూరి రస్తాల సంగతి నాకు బాగా తెలుసు. ఎంతో దూరమా, నాలుగు బారలు! అదిగో ఆ కొండ కవతల" అంటారు. రెండు జాములు నడవండి, మీరు గమ్యాన్ని మాత్రం చేరుకోలేరు. బహుశా అవి కబంధుడి చేతి బారలై వుంటాయి."

ఎరుగక పోయి ఈమెతో ఎందుకు మాట్లాడామురా బాబు అనిపించింది.

"ఐతేనేం లెండి" అందుకున్నాడు మధుసూదనం "బస్సు దిగగానే మీ కోసం బండి కాచుకుని వుంటుంది."

"అప్పటికీ నయం! పల్లకీ అన్నారుగారు! ఏం బండి? ఎద్దుల బండే గదూ?"

మధుసూదనం నా వైపు తిరిగి "మీ వూళ్ళో జట్కా బండి దొరుకుతుందా రాజా? అన్నాడు.

"జట్కా దొరకదు. అంతకంటే బాగుండే సవారీ బండి దొరుకుతుంది" లోలోపల బెదిరిపోతున్నా పైకి మాత్రం బింకంగానే అన్నాను.

శోభాదేవి మళ్ళీ కాసేపాలోచించి "ఇక్కడ బస్సెన్ని గంటలకు బయలుదేరుతుంది ?" అంటూ నెక్స్టు పాయింటు లోకి వచ్చింది.

బస్సుల రాకపోకల సంగతి మధుసూదనానికి తెలియదు గనుక మళ్ళీ నేను జవాబు చెప్పుకోవలసి వచ్చింది.

"మధ్యాహ్నం రెండు గంటలకో బస్సు బయల్దేరుతుంది. దాన్లో కూచుంటే మీరు మూడున్నరకల్లా తిప్ప సముద్రం చేరుకోవచ్చు." అన్నాను.

"భలేవారేనండీ ! ఐతే మండుటెండనీ, వడగాడ్పుల్నీ నా పాలే జేయాలనుకుంటున్నారన్న మాట ! ఏం, కాస్త చల్లటి వేళ బయల్దేరే బస్సులు లేనే లేవా ?"

"ఐతే మొదటి బస్సుకే రావడం మంచిదండీ ! అది ఉదయం అయిదుకల్లా యిక్కడ బయల్దేరుతుంది."

"దాన్నందుకోవాలంటే నేను తెల్లవారుజామున మూడు గంటలకే మేలుకోవలసి వుంటుంది,"

"పోనీ పది గంటల బస్సులో ప్రయత్నిస్తారటండీ ?"

"ఇక్కడ ఎనిమిదీ, లేక తొమ్మిది ప్రాంతంలో బయల్దేరే బస్సులు లేనేలేవా ?"

దీనికేం బదులు చెప్పాలో తోచక నేను దీనంగా మధుసూదనం వైపు చూచాను.

వాడు తన కర్తవ్య మెప్పుడో తీరిపోయినట్లు, చేతికి దొరికిన పుస్తకంలో పేజీలు త్రిప్పుతున్నాడు.

"పోనివ్వండి. నేను పది గంటల బస్సుకు రావడానికి ప్రయత్నిస్తాను. లేదంటే మొదటి బస్సుకే వచ్చేస్తాను. మీ రెవరైనా రోడ్డు దగ్గర వుండాలి. మరో ముఖ్య విషయం-అవూళ్ళో చిన్నా పెద్దా, ఆడా మగా అందరూ వరుసగా ఎగబడి నన్ను వింతగా, వినోదంగా చూడ్డానికొచ్చారంటే నేను పూరుకునేదాన్నిగాను. సభ్యత, సంస్కారం, క్రమశిక్షణ వీటి పట్ల నాకు పట్టింపు లెక్కువ. చెప్పవలసింది మొగమాటం లేకుండా చెప్పేయడం మంచిది గదండీ మధుసూదనం గారు..."

"కదండీ మరి!" మధుసూదనం టక్ మని ఆమె పాటకు తాళంవేసి "ఇక మేము వెళ్ళొస్తామండీ" అంటూ పైకి లేచాడు.

బంగాళాలో నుంచి బయటపడిన తర్వాత ఇదేమిట్రా మధూ! శోభాదేవి గారితో మాట్లాడానికే నాకు భయం వేస్తోంది. మాట పడకుండా ఈమెను మళ్ళీ సాగనంపేదాకా నా గుండె గడగడలాడుతూనే వుంటుంది" అన్నాను.

"నీకు మరేం భయంలేదులే రాజూ! నే నున్నానుగా" అంటూ అభయమిచ్చాడు మధుసూదనం.

*   *   *

మాట ప్రకారం మధుసూదనం బుధవారం సాయం త్రానికల్లా మా వూరికి వచ్చేశాడు. గురువార మంతా బాతా ఖానితో గడచిపోయింది. శుక్రవారం తెల్లవారేసరికి సమితి సభ్యులందరూ వాళ్ల వాళ్ల కార్యకలాపాల్లో నిమగ్ను లయ్యారు. నాటకాలనీ, హరికథలనీ హమేషా పొరుగూళ్ళ పైన తిరిగే హార్మోనిస్టు అంజయ్యను ఫైనల్ రిహార్సల్స్‌కు హాజరు పరచవలసిన భారం నా కప్పగించబడింది. మధుసూద నాన్ని రంగాలంకరణపైన అజమాయిషీకి నియోగించి, అంజయ్యకోసం రంగంపేటకు వెళ్ళి తిరిగొచ్చేసరికి పదిబారల ప్రొద్దెక్కిoది.

"ఏమిట్రా భాయీ! శోభాదేవిగారి సంగతి మరచే పోయావా?" హెచ్చరించాడు మధుసూదనం.

"లేదు మధూ! అందుకోసమే సుడిగాలిలా యిలా పరుగెత్తుకొచ్చాను" అని అతణ్ణి వెంటబెట్టుకుని ఆదరాబాదరా రోడ్డు దగ్గరికి బయల్దేరాను.

మార్గ మధ్యంలో "గంట ఎంతయింది?" అన్నాడు మధుసూదనం.

గడియారం చూసుకున్నాను. పదిన్నర కావస్తోంది. నా గుండె గుభేలు మంది.

"ఒరేయ్ మధూ! ఈ పాటికి బస్సు వచ్చి, అందులో నుంచీ శోభాదేవి దిగి, దగ్గర్లో మనం కనపడకపోయేసరికి అగ్గి మీద గుగ్గిలం మండిపడిపోతున్నదేమో!" సందేహాలవల్ల

కలిగిన ఆందోళనతో జ్వరం తగిలిన రోగికిమల్లే యీ వాక్యం ఆదినుంచీ తుదిదాకా కంపించిపోయింది.

మధుసూదనం పకపకా నవ్వి "అది కాదురా రాజూ! ఆమె పట్టణంలో బస్సెక్కి తీరా యిక్కడ రావడ మొక్కటే మనకు కావలసింది. వచ్చిన తర్వాత మండిపడినా, ఉద్దండం చేసినా అందువల్ల మనకు నష్టమయ్యేదేమీ లేదు. అంతెందుకూ? ఈ నీరెండలో ఆమెను రోడ్డు దగ్గరనుంచీ మీ వూరిదాకా నడిపిస్తానో లేదో చూద్దువు గానీ వుండు!" అన్నాడు.

నేను ఉలికిపడ్డాను. అంతవరకూ నాకు బండినిగురించి జ్ఞాపకమే లేదు!

"ఇదిగో మధూ! నువ్వు కాసేపు యిక్కడే వుండు. నేను వూళ్లోకి వెళ్ళి సవారీ తీసుకొస్తాను" అన్నాను.

మధుసూదనం మట్టిబాట కడ్డంగా గ్రీకు వీరుడిలా ఠీవిగా నిలబడి, గలివరు బ్రాబ్డింగు, లిల్లీపుట్ దేశస్థుణ్ణి చూచినట్టుగా నా వైపొక నిర్లక్ష్య వీక్షణాన్ని విసిరి "ప్రతి చిన్న విషయానికీ యింతగా బెంబేలు పడిపోతూ, ఎక్కడ కక్కడే ఒదుగుల్లో పోతే యింక నీ బ్రతుకేం కొనసాగుతుందిరా బాబూ! మనిషి అన్నతర్వాత దేనికైనా సిద్ధపడాలి. మోకాటి హెచ్చూ తక్కువా చూడకుండా ఎలా వీలైతే అలా నడిచి వెళ్ళిపోవాలి" అంటూ భుజంపైన చేయి వేసి నన్ను ముందుకు తోశాడు. వాడి వెంట అప్రయత్నంగా నడవసాగాను.

రోడ్డుపైన బస్సులు వాడుగ్గా నిలిచేచోట మనుషు లెవ్వరూ లేరు. ఆ పరిసర ప్రదేశం గూడా నిర్జనంగా వుంది. లేదంటే దూరంగా వేపచెట్టుక్కి ఓ కుర్రాడు మేకల కోసం కొమ్మలు నరుకుతున్నాడు. వాణ్ణి దాపుకు పిలిచి బస్సు వెళ్ళి నదీ, లేనిదీ వాకబు చేశాను.

"పదిగంటల బస్సు యిలా గెళ్ళిపోయి రెండు గడియ లైంది బాబూ!" అన్నాడు కుర్రాడు.

"దానిలోనుంచి ఎవరూ దిగలే దేమిటి?"

"ఎవరు దిగుతారు బాబయ్యా! అది ఇక్కడెక్కడా ఆగకుండా యిమానంలా ఎళ్ళిపోతే!"

నేను మధుసూదనం ముఖాన్ని చూచాను. మధుసూదనం నా ముఖాన్ని చూచాడు. ఇద్దరమూ ఒకరి కొకరం డిటోగా తెల్లబోయాము.

"కానీ తెల్లారిపూట యిక్కడో సిత్రం జరిగింది బాబూ!" మళ్లీ ప్రారంభించాడు కుర్రాడు.

"ఏం జరిగింది?" అన్నాను పరధ్యానంగా.

"ఉదయం ఎనిమిది గంటల బస్సొచ్చి ఇక్కడాగిందా బాబూ! దాన్లోంచి ఓ డాక్టరమ్మగారు దిగేశారు..."

"డాక్టరమ్మగారా! ఎలా వుంటుందిరా బాబూ, మనిషెలా వుంటుంది?" కంగారుగా ప్రశ్నించాను,

"ఎర్రటి మనిషండీ! తెల్లటి చీర కట్టుకున్నారు. కళ్ల కద్దా లున్నాయి. కాళ్ళకు జోళ్లున్నాయి. చేతిలో ఓ చిన్న సంచీ వుంది..."

"కొంప మునిగిందిరా మధూ! ఈ ఆనవాళ్ళన్నీ శోభా దేవి గారికి సరిపోతున్నాయి." అని "మరైతే ఆమె ఎలా వెళ్ళింది?" అని కుర్రాణ్ణి ప్రశ్నించాను.

"ఎక్కడికైనా వెళ్ళిపోయుంటే చిత్రమే ముంది బాబూ! బస్సాగింది. ఆమె దిగారు. అటూ యిటూ చూచారు. పొద్దు చూచారు. చేతిగుడ్డతో ముఖం తుడుచు కున్నారు. కాసేపు యిక్కడే పచార్లు చేశారు. ఆ పైన చెట్టుక్రింద నీడలో నిల్చున్నారు. ఇలాగా డాక్టరమ్మగారు ఆపసోపాలు పడుతూనే వున్నారు, ఇంతలో కదిరినుంచీ యీ వైపెళ్ళే బస్సొచ్చి యిక్కడాగింది. దాన్లో ఎక్కి ఆమెగా రొచ్చినదారి వెంబడే వెళ్ళిపోయారు."

"హతోస్మి, హతోస్మి" అనుకున్నాను సగం స్వగతంగా, సగం ప్రకాశంగా.

"నెవర్ మైండ్, నెవర్ మైండ్" అన్నాడు మధుసూదనం నిర్లక్ష్యంగా.

"అదేమిట్రా మధూ! ఊరు వూరంతా ఆమెకోసం ఎదురు చూస్తోంది. పైగా వూళ్లు తిరిగి అయిన పాంప్లేట్లన్నీ పంచిపెట్టేశారు. వాళ్లకు నే నేమని చెప్పుకోను?"

"నువ్వు మరీ డెస్పరేట్ అయిపోతున్నావురా రాజూ! నేను నీకు ఒకే ఒక మాట చెబుతున్నాను. కోడి లేనంత మాత్రాన తెల్లవారక పోదు. కానీ మన జాగ్రత్తలో మనం వుండడం మంచిది. ఏ పరిస్థితిలో గానీ, ఎవరితో గానీ నువ్వు శోభాదేవిగారు రాలేదని గానీ, రాదనిగానీ చెప్పగూడదు.

'ఇదిగో పది నిమిషాల్లో రారూ!' అని, 'అదిగో కారు శబ్దం వినిపించడం లేదూ?' అని కాలం దొర్లించేయాలి. అంతగా అవసరమైతే చిట్టచివర ఓ క్షమాపణ చెప్పుకుంటే సరి పోతుంది."

*　　　*　　　*

మధుసూదనం సలహా అమల్లో పెట్టడం కన్నా నాకు గత్యంతరం తోచింది గాదు. మేము ఊళ్ళోకి తిరిగి వచ్చేసరికి మా చుట్టూ ఓ జనసమూహం ప్రోగైంది. "శోభా దేవిగారు రాలేదా? ఎందుకు రాలేదు? ఎప్పుడొస్తారు? ఆమెకు స్వంత కారుందా? పోనీ టాక్సీలో రమ్మన లేకపోయారా?"—ఇలా ఒకుటొమ్మడిగా మా పైన ప్రశ్నలవర్షం కురిసింది. "వస్తా రొస్తారు. మీరు కాస్త ఓపిక పట్టాలి. రాత్రి ఎనిమిదిగంటల కెప్పుడో మీటింగైతే మధ్యాహ్నానికల్లా వచ్చి తిప్ప సముద్రంలో తీరుబాటుగా కూచోడానికి పట్టణంలో శోభా దేవి గారు చేస్తున్నది గోళ్లు గిల్లుకునే ఉద్యోగం కాదు. ఎన్ని సభలు, ఎన్ని సమావేశాలు, ఎన్ని ఎంగేజిమెంట్లు! వాటి నన్నింటినీ వదిలించుకోవాలి. బస్సో, కారో, టాక్సియో ఏదో ఒక ప్రయాణ సౌకర్యం చూచుకుని బయల్దేరాలి. గతుకుల రోడ్డుమీద ఇరవై మైళ్లు రావాలి. ఇంత తతంగం జరిగిన తర్వాత గానీ శోభా దేవిగారు మీకు కనిపించరు. అంత దూరం ఎందుకు? నాటకం ప్రారంభమై తెర లేచేదాకా వేషం మీ కెప్పుడైనా కనిపిస్తుందా? అలా కనిపించి వేషధారి గూడా ప్రేక్షకుల్లో కలిసిపోతే ఇక నాటకంలో స్వారస్య

మేముంది ? అసలు గొప్పవాళ్ళ సంగతే అంత! వాళ్లు ఎని
మిది గంటలకు మీటింగంటే ఇంటిదగ్గర సరిగ్గా ఏడు యాభై
అయిదుకు బయల్దేరుతారు. ఏడూ యాభై తొమ్మిదికి సభా
స్థలికి చేరుకుంటారు. ఎనిమిది కొడుతుండగా ఆసనం స్వీక
రిస్తారు. ఆ మరునిమిషాన ప్రోగ్రాం ప్రారంభమై పోతుంది''
అంటూ మధుసూదనం ఎన్నికలైపోయిన తర్వాత వాగ్దాన
భంగాన్ని సమర్థించుకునే ప్రజాప్రతినిధికిమల్లే ఓ సుదీర్ఘమైన
జవాబును అందుకు తగిన హావభావాలతో మేళవించి శ్రవణా
నందకరంగా ఉపన్యసించేశాడు.

మధుసూదనం సంజాయిషీ కార్యకర్తలకు నిరుత్సాహం
కలిగించక పోవడం అటుండగా వాళ్ళ ఉత్సాహం ద్విగుణీ
కృతమైనట్లు గూడా తోచింది. ఏండ్లుగా పూండ్లుగా ఇళ్లల్లో
ఎక్కడో ఎండకన్నెరుగకుండా పడివుండిన కుర్చీలు, బల్లలు,
బెంచీలు పందిరి క్రిందికి చేరుకుంటున్నాయి. అప్పుడే బిగించిన
మైక్ సెట్ లోనుంచీ పాడడానికి నోరు గలిగిన ప్రతి స్థానిక
గాయకుడు ముందు పడడంతో అక్కడో చిన్న గలాటా
తయారైంది. తెరలు క్రిందికి దించి స్టేజిపైన 'ఆఖరు వద్దిక'
ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. సూర్యాస్త
మానం చేరువ కాను, కానూ ఎక్కువైపోతున్న ఈ సంరం
భంలో ఉత్సాహం బొత్తిగా అడుగంటిపోయి, బాగా చప్ప
బడిపోయినవాణ్ణి బహుశా నేనొక్కడినే నేమో! నాకక్కడ
నిల్చోడానికి గూడా మనస్కరించడం లేదు. ముఖం చాటు
చేసుకుని దూరంగా వెళ్ళిపోతే బాగుండు ననిపించింది. అం

దుకు తగ్గట్టుగా కార్యదర్శి నాకో పని పురమాయించాడు. ఆర్కెస్ట్రావాళ్ళకూ, ఇంకా కొంతమంది అతిథులకు సత్రంలో భోజనపు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నేనైతే ఆ ఏర్పాట్ల పైన చక్కగా పర్యవేక్షణ జరపగలనని తోచింది కార్యదర్శి గారికి!

సత్రంలో పొయిమీదినుంచీ ఆఖరుపాత్ర దింపేసరికి గంట ఏడున్నరయింది. 'నాలుగైదు నాటికలు ప్రదర్శింపబడ నున్నాయి గనుక ప్రోగ్రాం పూర్తయ్యేసరికి అర్ధరాత్రి దాటి పోతుంది. అంచేత భోజనాలు ఎనిమిదికి లోపుగానే పూర్తై పోవాలి' అని కార్యదర్శి కబురు పంపించాడు.

ఆ కబురు తెచ్చినవాడి పేరు నాగేశం.

"అది సరేగానీ నాగేశం, కార్యక్రమం సరిగ్గా ఎని మిది గంటలకు ప్రారంభమైపోవచ్చు నంటావా?" అన్నాను.

"ఆటంక మేముంది? శోభాదేవిగారు గూడా వచ్చే శారుగా!" అన్నాడు నాగేశం.

"ఏమి టేమిటి? వచ్చేశారా, శోభాదేవిగారు! నిజంగా?"

"అదేమిటి రాజూ! నువ్వే లోకంలో వున్నావు? ఇది భూలోకం. అదేపనిగా నువ్వు వెళ్ళి పిలిచి వస్తే ఆమె గారు రావడంలో ఆశ్చర్య మేముందయ్యా! రాకపోతే ఆశ్చర్య పడాలి గానీ..."

అంతకుమించి నేనాశ్చర్యాన్ని ప్రకటించడానికి వీల్లేక పోయింది. కాని ఇదంతా నాకు అయోమయంగా వుందని మాత్రం ఒప్పుకోక తప్పదు. ఉదయం ఏడు గంటలప్పుడు బస్సు దిగి తనకు యథోచిత స్వాగత సత్కారాలు లభించ లేదన్న కినుకతో తిరుగు బస్సులో నగరానికి దారితీసిన శోభా దేవి మళ్లీ యిప్పు డెలా వచ్చింది? ఏ బస్సులో వచ్చింది? ఇంతకూ ఉదయం రోడ్డులో బస్సు దిగింది శోభాదేవిగారేనా, వేరొకరా?

సంశయాలతో నేనిలా కొట్టు మిట్టాడు తుండగానే మరొక వార్తాహరి పరిగెంచి వచ్చి "ఇంకా భోజనాలు వడ్డించలేదా? సరే సరే, ఇలాగైతే ప్రోగ్రాం ప్రారంభ మైనట్లే!" అంటూ వేగిరించాడు.

నేను అటూ యిటూ చూచాను. వాడినీ వీడినీ పిలి చాను. కానీ ఎవడికి వాడు ఎదుటివాడికి పనులు పురమా యించడం తప్పితే స్వయంగా పూచిక పుల్లంత పనిచేయ డానికైనా తీరికలేక అల్లిబిల్లి తిరుగుతూ వుండడంవల్ల చివరకు నేనే విస్తళ్లు వెసి, పేరు పేరునా పిలిచి అతిథుల్ని బంతిలో కూచోబెట్టవలసి వచ్చింది.

ఇక్కడ భోజనాలు వడ్డించాం. అక్కడ ప్రార్థన ప్రారంభమైంది.

ప్రార్థనానంతరం గ్రామ ప్రముఖులు, నేటి సభకు అధ్యక్షులు, సమితికి విరాళం యివ్వనున్నట్లు యీ సభలో

వాగ్దానం చేయనున్నవారు, అయిన పాపన్నగారి ఉపన్యాసం ప్రారంభమైంది.

పాపన్న గారికి ఉపన్యాసానుభవం తక్కువ. ఉబలాటం ఎక్కువ. కాంగోనది జన్మస్థానాన్నైనా కనిపెట్టినవా రున్నారు గానీ పాపన్నగారి వాక్యానికి గమ్యస్థానాన్ని కనిపెట్టినవాళ్లు లేరు. ఆయన నోటినుండి వెలువడే వాక్యాలు ఆగవు, అలాగని ఒకమానాన ముందుకు సాగవు. చెప్పదలచుకున్న విషయం స్ఫురించిన మాటల్నిబట్టి మారిపోతూ వుండడం ఆయన ఉపన్యాసంలోని ప్రత్యేకత.

తొలిపలుకుల్ని సంగ్రహంగా ముగించి, శోభాదేవిగారు మాట్లాడగలరని తదుపరి కార్యక్రమాన్ని ప్రవచించి అక్కడ పాపన్నగారు కూర్చునేసరికి యిక్కడ భోక్తలు పాయసం దాకా వచ్చారు.

రెండు క్షణాలవరకూ నిశ్శబ్దం. ఆ తరువాత శబ్దవిస్తరణ యంత్రంలో ఓ మృదు మధురమైన కంఠస్వరం వినిపించింది.

"అధ్యక్షా! సోదరులారా! సోదరీమణులారా! ఈ రోజు రాత్రి మిమ్మల్ని, ఇంతమందిని యిక్కడ కలుసుకోగలిగినందుకు సంతోషంగా వుంది. నాకీ అవకాశాన్ని కలిగించిన సేవాసమితి నిర్వాహక వర్గంవారికి నేను కృతజ్ఞురాలిని. వారం రోజులకు మునుపు మీలో ఒకరైన రాజశేఖరంగారు నన్ను కలుసుకుని సేవాసమితి ఆశయాలను వివరించి చెప్పారు. ఆయన చెప్పకముందే నాకు 'సేవ'ను గురించి

కొద్దిగా తెలుసు. మానవసేవే మాధవసేవ అన్నారు పెద్దలు. 'నిద్రించి యీ లోకమంతా సౌందర్యమయ మనుకున్నాను. మేల్కొంచి యీ బ్రతుకంతా సేవామయ మని తెలుసుకున్నా...' అని ఆంగ్లంలో ఓ సామెత వుంది..."

ఉపన్యాసాన్ని శ్రద్ధగా వింటున్నానేమో, ఒక విస్తరిలో మజ్జిగకు బదులుగా మంచినీళ్లు వడ్డించాను. 'ఉప్పు, ఉప్పు' అని ఎవరో కేకవేయడం విని, ఆ పరధ్యానములో మరో విస్తరిలోని పాయసంలో చేరెడు ఉప్పు గుమ్మరించేశాను. అంతటితో అక్కడున్నవాళ్ళందరూ ఒక్కుమ్మడిగా "బాబూ, మా భోజనాలు పూర్తి కావస్తున్నాయి. ఇక నువ్వు సెలవు తీసుకోవచ్చు" అని నన్ను అక్కడినుంచి సాగనంపేశారు.

జనంతో కిటకిటలాడిపోతున్న సభాస్థలంలో త్రోవ చేసుకుని ముందుకు వెళ్తున్నాను. రంగుకాగితాల తోరణాల వెనుక ఉపన్యాసకురాలి ముఖం స్పష్టంగా కనిపించడం లేదు. వేదిదగ్గరకు వెళ్ళి మిరుమిట్లు గొలుపుతున్న విద్యుద్దీపాల కాంతిలో పైకి చూచాను. ఆ చూచిన క్షణంలో నేను నిట్టనిలువునా కొయ్యబారిపోయాను. నా కళ్ళేగనుక నన్ను మోసగించక పోయినట్టయితే ఆవిడ శోభాదేవికాదు. శోభాదేవి యింత బక్కపలచగా వుండదు. మరైతే ఈవిడెవరని నేను పెద్దగా వితర్కించుకోవలసిన అవసరం గూడా లేకపోయింది. ఈవిడ మరీచిక! మా మధుసూదనం ప్రేయసి!!

మధుసూదనం కోసం చుట్టుప్రక్కలా కలయ పరికిం చాను. వేదిక వెనకవైపుకు వెళ్లాను. గ్రీన్ రూములో చూచాను. ఊహు, వాడు పత్తా లేడు!

అప్పుడు నా బుర్రలో ఓ అనుమానం మెరపులా మెరసింది.

నాలుగడుగుల్లో చరచరా వేదికచెంతకు వెళ్ళాను. ఈ సారి ఉపన్యాసకురాలి ముఖాన్ని బాగా పరకాయించి చూచాను. కొద్దిక్షణాలక్రితం ఏదైతే నా వూహలో అనుమా నంలా భాసించిందో అది కేవలం అనుమానం కాదు. అక్ష రాలా నిజం!

మాయ అన్న తెర తొలగిపోయిన తర్వాత సత్యమూ నిత్యమూ అయిన పరతత్వాన్ని సందర్శించిన యోగీశ్వరుడిలా నేనక్కడే పది పదిహేను నిమిషాలవరకూ స్తంభీకృతుడనై నిలిచిపోయాను.

*   *   *

నాటికలు జయప్రదంగా ముగిశాయి. నాటికన్నా మధుసూదనం ఏకపాత్రాభినయం దిగ్విజయంగా రాణించింది. ప్రపంచమే ఒక నాటకరంగం అన్న పరమసత్యాన్ని ఒంట బట్టించుకున్న కొద్దిమందిలో మధుసూదనం ఒకడు. మానవుడు దేనికైనా సిద్ధపడి వుండాలన్నది వాడు జీవిత సౌధాగ్రాన చెరగని అక్షరాలతో లిఖించుకున్నమాట. వేదికపైనుంచీ గ్రీన్‌రూములోకి రాగానే నేను వాణ్ణి బారెడు పొడుగు పుష్ప

హారంతో మళ్లీ ఒకసారి అలంకరించాను. అంతటితో నేను ఊరుకోవలసింది. కానీ హర్షాతిరేకంలో ఔచిత్యాన్ని విస్మరించి "శోభాదేవిగారూ! పదిమందిలో కించపడిపోవలసిన నన్ను యీ విధంగా ఆదుకోగలరని నే ననుకోలేదు. మీరు నా పరువును నిలబెట్టారు. ఇందుకు నేను మీ కెలా కృతజ్ఞత చెప్పుకోవాలో తోచడం లేదు" అంటూ చేతులు సాచి గాఢపరిష్వంగంలోకి తీసుకున్నాను.

"ఎక్కడ ఫొటోగ్రాఫర్! పిలవండి, పిలవండి. ఫొటోగ్రాఫర్‌ను పిలవండి! ఆలసించిన ఆశాభంగం. మంచి సమయం. మించిన దొరకదు" అంది శోభాదేవి పాత్రధారిణి మిస్. మరీచిక, ఉరఫ్ మధుసూదనం.

---